దుర్గా మాత వైభవం.. శరన్నవరాత్రి శోభితం

- నేటి నుంచి దసరా నవరాత్రులు
- ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- శ్రీశైలం, మహానంది, కర్నూలు చిన్న అమ్మవారి శాలలో ప్రత్యేక వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, ఆలయ కమిటీలు
- కర్నూలు పుర వీధుల్లో కొలువు దీరనున్న దుర్గా మాత విగ్రహాలు


ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు ఆలయం


లలితా త్రిపుర సుందరి


కొలువు దీరనున్న దుర్గమ్మ విగ్రహం

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభం కానున్నాయి. దసరా అంటేనే సందడి. సంతోషం. హిందువుల ప్రధాన పండుగ ఇది. దేశ వ్యాప్తంగా ప్రజలందరూ అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. పది రోజుల పాటు పరమ పావనంగా జరుపుకునే పండుగ. అమ్మవారిని రోజుకో రీతిన అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు చేస్తారు. చివరి మూడు రోజులైన దుర్గాష్టమి, మహర్ణవమి, విజయదశమి మరింత విశిష్టం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు జరుపుకునే పండుగే దసరా. ఇందులో తొమ్మిది రోజులు ప్రత్యేకంగా శివసతి అయిన పార్వతీ దేవిని విశేషమైన అలంకారాలతో, వేరు వేరు నామాలతో పూజిస్తారు. వీరికి నవ దుర్గలు అని పేరు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని కూడా అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుకే ఈ పేరు వచ్చింది.

- ఈనెల 21వ తేదీ అమావాస్యతో ఆశ్వీయుజ మాసం ముగిసి నిజ ఆశ్వీయుజం ప్రారంభం కావడంతో 22వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 2వ తేదీన విజయ దశమిని జరుపుకుంటారు. ఈ పండుగకు బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. పదో రోజు పార్వేట ఉత్సవం జరుగుతుంది.
- కర్నూలు నగరంతో పాటు శ్రీశైలం, మహానంది, ఆదోని, నంద్యాల, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందవరం, నందికొట్కూరుకు, బనగానపల్లె, ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడేలా ఆలయాలను సర్వాంగ సందరంగా ముస్తాబు చేశారు. కర్నూలు పాత నగరంలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, గీతామందిరం, కాళికాంబ ఆలయం, నిమిషాంబ దేవీ ఆలయం, లలితా త్రిపుర సుందరీ దేవి ఆలయం, అంభా భవాని ఆలయం, సప్తగిరి నగర్ చౌడేశ్వరీదేవి ఆలయం, అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయంతో పాటు నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లి ఎల్లమ్మ, నన్నూరు సరస్వతి దేవి ఆలయాలతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్లలో దుర్గా మాత విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.
- శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవ రోజుల్లో స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా, సమయానుకూలంగా జరిపించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామివారికి విశేష అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రుద్రయాగం, చండీయాగం, అమ్మవారి ఉత్సవ మూర్తికి నవదుర్గ అలంకరణలు, స్వామి అమ్మవార్లకు వివిధ వాహన సేవలు జరిపిస్తారు. మహర్ణవమి రోజున రాష్ట్ర ప్రభుత్వంచే స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉత్సవాల చివరి రోజు స్వామి అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

దసర సంబరాలు సమైఖ్యతకు చిహ్నం.. కర్రల సమరం..

దేవరగట్టు కర్రల సమరానికి రాష్ట్రంలో ఎంతో విశిష్టత ఉంది. దసరా రోజు అర్ధరాత్రి నుంచి దేవరగట్టు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మూడు గ్రామాల ప్రజలు మాళమల్లేశ్వర స్వామిని దక్కించుకోవడం కోసం సమరానికి దిగుతారు. నెరణికి, నెరణికితాండ, కొత్తపేట గ్రామాలకు చెందిన ప్రజలు విజయ దశమికి 12 రోజుల ముందు నుంచి నిష్టగా ఉండి పూజలు చేస్తారు. 12వ రోజు అర్ధరాత్రి నుంచి కర్రల సమరం మొదలై తెల్లవారే వరకు సాగుతుంది.

పార్వేటకు ప్రముఖ స్థానం

విజయ దశమి వేడుకల్లో భాగంగా మద్దికెరలో గుర్రాల పార్వేట ప్రత్యేకంగా నిలుస్తుంది. దసరా రోజు సాయంత్రం యాదవ రాజ వంశీకులకు చెందిన పెద్దనగరి, చిన్న నగరి, వేమనగరి కుటుంబాలకు చెందిన వారు ఈ పార్వేటలో పాల్గొంటారు. మద్ది కులస్తులు సైన్యంలా ఆయుధాలు ధరించి రాజ వంశీకుల వెంట గ్రామ సరిహద్దు వరకు వెళతారు. అక్కడ వారు దేవుడికి పూజలు నిర్వహించి అక్కడి నుంచి మద్దికెరకు గుర్రాలపై స్వారీ చేస్తూ వస్తారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తారు.

సాహస విన్యాసాలకు సముచిత స్థానం

ఎమ్మిగనూరు మండలం గుడేకల్లులో విజయదశమి మరుసటి రోజు కరి పండుగ నాడు యువత సాహస విన్యాసాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. వీపులకు కడ్డీలు గుచ్చుకోవడం, పళ్లతో బరువులు ఎత్తడం, ఇసుక సంచులు ఎత్తడం, బండ్లు లాగడం, రాళ్ల గుండ్లు ఎత్తడం లాంటి సాహస కృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చెడుపై మంచి గెలుపునకు సంకేతం

ఆదోని పట్టణంలో దసరా రోజు రాత్రి మున్సిపల్ మైదానం, చిన్న శక్తి గుడి ఆవరణలో రావణ కుంభకర్ణుల బొమ్మలను దహనం చేస్తారు. చెడుపై మంచి గెలుపునకు సంకేతంగా ప్రజలు సంతోషంతో 25 అడుగుల రావణ కుంభకర్ణుల బొమ్మలను దహనం చేస్తూ సంబరాలు జరుపుకుంటారు.


విద్యుద్దీపాల వెలుగులో శివపార్వతుల అలంకరణ


బిర్లాగేట్ సర్కిల్‌లో కొలువుదీరిన దుర్గమ్మ


విద్యుద్దీపాలంకరణలో కల్లూరు వాసవీ మాత ఆలయం

క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పించాలి


ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.నరసింహులు, వార్డు సభ్యులు కేవీ జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్యంగా సీసీ రోడ్లు వేయాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని, రోగాల బారిన పడకుండా సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి వినతులు వచ్చినట్లు చెప్పారు. నాయకులు శేషంరాజు, ప్రసాదు, సలాంబాషా, మద్దిలేటి, బాషా పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా


పతకాలు సాధించిన క్రీడాకారులు

కర్నూలు (టౌన్): గుంటూరు పట్టణంలో ఈ నెల 20, 21 తేదీల్లో అండర్–14 బాలుర విభాగంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటారు. 79 కేజీల విభాగంలో ఆఫ్రీది (బంగారు), ఫైజాన్ (కాంస్యం), ఇంతియాజ్ (కాంస్యం) పతకాలు సాధించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాపా అభినందించారు.

మోడరన్ పెంటాథ్లాన్‌లో పతకాలు


కప్పు అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): కాకినాడ పట్టణంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటాథ్లాన్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి మూడవ స్థానంలో నిలిచినట్లు జిల్లా మోడరన్ పెంటాథ్లాన్ అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ మహిళల విభాగంలో డి.వెంకటేశ్వరి (మొదటి స్థానం), పుష్పా స్వాతి (మూడవ స్థానం), జూనియర్స్ విభాగంలో షేక్ సమీయ తస్లీమ్ (మొదటి స్థానం), మిక్స్‌డ్ రిలే సీనియర్ విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు.

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

కర్నూలు సిటీ: డీఎస్సీ–2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి వెబ్ కౌన్సెలింగ్ గాకుండా, మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపాస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారికి ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చిన్న నాగస్వామి నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయనతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ ఎన్‌వీఎస్ గుప్తా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో విలువలు పెంచే విధంగా ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎం.ప్రశాంతి దేవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆడిట్ సభ్యులు సి.శ్రీనివాసులు, రాష్ట్ర అకడమిక్ కార్యదర్శి బి.లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సంఘ సంస్కర్త గురజాడ

కర్నూలు కల్చరల్: 20వ శతాబ్దంలో తన రచనల ద్వారా సంఘంలో గొప్ప మార్పు తెచ్చిన సంస్కర్త గురజాడ అప్పారావు అని టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. గురజాడ రచించిన దేశభక్తి గేయం, దిద్దుబాటు నాటిక ద్వారా ఆధునిక సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేశారన్నారు. ఆనాటి సాంఘిక దురాచారాలపై ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ఒక సంచలనమన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని పేర్కొన్నారన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వర్, సభ్యులు గురుమూర్తి, కేవీ రమణ, సంగా ఆంజనేయులు, జీవీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె వివరించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు.

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అన్నదాతలు సాగు చేసిన ఉల్లి, టమాటా, పత్తి, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి లేఖ రాశారు. తక్షణమే ఉల్లి రైతుకు ఎకరాకు రూ.50 వేలు, పత్తి రైతుకు రూ.45 వేలు, టమోటా రైతుకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. అన్నదాతలను ఆదుకోకపోతే వారికి ఆత్మహత్యలు తప్పా మరో దారి ఉండదని పేర్కొన్నారు.

నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాక

కర్నూలు(సెంట్రల్): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఉదయం 10 గంటలకు కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులు, మధ్యాహ్నం 1 గంటకు పత్తికొండ టమాటా మార్కెట్, మధ్యాహ్నం 2.30 గంటలకు ఆదోని మెడికల్ కాలేజీని సందర్శిస్తారని చెప్పారు.

గిట్టుబాటు ధర కల్పించకపోవడం దారుణం


ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఉల్లి, టమాట, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ రైతు సంఘం ప్రతినిధులు కల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. పెద్దటేకూరు గ్రామంలో మహేష్, రాముడు సాగు చేసిన పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. అలాగే కె. మార్కాపురం, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల గ్రామాల్లో ఉల్లి పంటలను పరిశీలించి రైతులు పడుతున్న బాధలను తెలుసుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉల్లి క్వింటా రూ. 1,200, టమాట కేజీ రూ. 8 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఉల్లిని క్వింటా రూ.3వేలు, పత్తి క్వింటా రూ. 10వేలు, టమాట కేజీ రూ. 20 ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. అలాగే రైతులు దిగుబడులను అరబెట్టడానికి, వర్షాలు వస్తే ధాన్యం కప్పుకోవడానికి టార్పిలిన్ పట్టాలు ఇవ్వాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు దొడ్డిపాడు బాషా, పుల్లన్న, రాముడు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రాణించాలి


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ వాసురెడ్డి

కర్నూలు (టౌన్): బాక్సింగ్ వంటి క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో సాధన చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.తేజ, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, మాస్టర్లు షకీల సురేష్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

మానవాళి శ్రేయస్సే జేఐహెచ్ ధ్యేయం


మాట్లాడుతున్న మొహమ్మద్ అక్బర్‌బాషా

కర్నూలు(అర్బన్): భారతదేశ ప్రజల మధ్య సుహృద్భావం, మత సామరస్యం, శాంతితో పాటు ఒకరి మధ్య ఒకరికి సహకారం అందిస్తూ సర్వ మానవాళి శ్రేయస్సే ధ్యేయంగా జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) పనిచేస్తోందని సంస్థ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అక్బర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జమాతే ఇస్లామీ మీడియా ఒరియేంటేషన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. దేశంలో 25 కోట్లకు పైగా ముస్లింలు ఉన్నారని, వారంతా రాజ్యాంగ పరంగా గుర్తింపు పొందిన మైనారిటీలని చెప్పారు. రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు ఇస్తుందని, అల్ప సంఖ్యాకులనే తేడా లేకుండా సమానత్వం కల్పించడంలో మీడియా తన పాత్రను పోషించాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొంత మేర ఉపశమనం కలిగించిందన్నారు. అయితే వక్ఫ్ సవరణ చట్టంలో ఉన్న లోపభూయిష్టమైన అంశాలను పూర్తిగా రద్దు చేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపునకు దేశంలోని అన్ని ముస్లిం సంస్థలు మద్దతు తెలియజేశాయన్నారు. సంస్థ రాష్ట్ర సభ్యులు మహమ్మద్ ఇబ్రహీం, షరీఫ్, స్థానిక అధ్యక్షుడు చాంద్‌బాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మహిళల హక్కుల కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. ఆదివారం జీబీ ఫంక్షన్ హాలులో రషీదా అధ్యక్షతన ఐద్వా నగర మూడో మహాసభలు జరిగాయి. ముందుగా సీనియర్ నాయకురాలు ఖమృద్ది జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పి.నిర్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతూ మహిళలకు ప్రాణ సంకటంగా మారిందన్నారు. కొందరు తాగి వచ్చి మహిళలను హింసిస్తున్నారని, మద్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులను అందుబాటులోకి తేవడంతోపాటు బెల్టు షాపులను కూడా తీసుకొచ్చి మహిళల ఇబ్బందులకు కూటమి ప్రభుత్వం కారణమవుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతి రోజూ ఎక్కడో ఒకచోటా మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డి.రషీదాదేశాయ్, బంగి పద్మతోపాటు 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): ఆస్తి ఉందన్న మదంతో కుమారుడిని చంపి, భార్యపై హత్యాయత్నం చేసిన దేవనకొండకు చెందిన నరేష్, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు కె.అరుణ డిమాండ్ చేశారు. ఇటీవల నరేష్ చేతిలో హత్యాయత్నానికి గురై చావుబతుకుల మధ్య ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య శ్రావణిని ఐద్వా, డీవైఎఫ్ఐ, సీపీఎం నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.ఎస్ సుజాత, ఎండీ ఆనంద్ బాబు, సూరి, హుస్సేన్‌బాషా, బాబీ పాల్గొన్నారు.

ఉల్లి రైతును నట్టేట ముంచిన ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఉల్లి రైతును నట్టేట ముంచిందని, ఆదుకుంటామని చెప్పి మోసం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మొదట చెప్పిన విధంగా ఉల్లి క్వింటాల్‌కు రూ.1200 ప్రకారం రైతులకు ఇవ్వాలన్నారు. అంతేకాక ప్రస్తుతం ఇస్తామన్న ఎకరాకు రూ.20 వేలు కూడా ఇస్తేనే అన్నదాతకు కనీసం పెట్టుబడులైనా చేతికి వస్తాయన్నారు. జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవడానికి మంత్రి టీజీ భరత్ చర్యలు తీసుకోవాలని కోరారు.


జేఎన్ శేషయ్య ఆశయ సాధనకు కృషి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం సీనియర్ నాయకులు జేఎన్ శేషయ్య ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఆ పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన సెప్టెంబర్ 8వ తేదీన మరణించిన జేఎన్ శేషయ్య సంస్మరణ సభను నిర్వహించారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నాయకులు రాజు, ధనుంజయ్య, గురుశేఖర్, ప్రసాదు శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మక్బూల్

కర్నూలు(సెంట్రల్): ఇంటర్నేషల్ హ్యూమన్ రైట్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ రాష్ట్ర కార్యదర్శిగా కర్నూలుకు చెందిన మక్బూల్‌బాషా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం నేషనల్ జాయింట్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి ఓ ప్రకటనను విడుదల చేశారు. సమాజంలో మహిళలు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మక్బూల్‌బాషా ఈ సందర్భంగా చెప్పారు.

ఇలా ఉంటే రోగాలు రావా?


ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

కల్లూరు: కర్నూలు నగరం నంద్యాల రోడ్డు నుంచి దిన్నెదేవరపాడు రోడ్డును కలిపే వంద అడుగుల రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలుస్తోంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు, లార్వాలకు నెలవుగా మారింది. దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అక్కడ నివాసం ఉంటున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భగవద్గీత పోటీలు


మాట్లాడుతున్న శ్రీధర్

కర్నూలు కల్చరల్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అరోరా నగర్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 106 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను వాటి తాత్పర్యాలను సంపూర్ణంగా అర్థం చేసుకొని జీవితంలో పాటించడానికి ప్రయత్నించాలన్నారు. కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు, స్వదేశీ స్వావలంబన లాంటి పంచ పరివర్తన్ ద్వారా ఇవి సాధ్యపడతాయన్నారు. విజేతలకు అక్టోబర్ 1న బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలకు శరత్ చంద్ర, అనిల్, వనజ, పార్వతీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, సాయినాథ్, షణ్ముఖ కృష్ణ, చంద్రశేఖర్, కోదండ రామయ్య, ఎల్లయ్య శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

లాల్ నీల్ ప్రయాణమే కవిత్వం


వెంకట కృష్ణ కవిత్వ సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో మూడు దశాబ్దాలకు పైగా ప్రగతి శీల కవిత్వంతో చైతన్యపరుస్తూ, మనిషి కేంద్రంగా సాహిత్య సృజనతో వెంకట కృష్ణ రచనలు చేస్తున్నారని, ఆయన ప్రయాణం లాల్ నీల్ సిద్ధాంతమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కర్నూలు కవుల ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ కవి వెంకట కృష్ణ కవిత్వ సమగ్ర సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సాహితీ వేత్త జి.భార్గవ కవితా సంపుటిని ఆవిష్కరించారు. లో గొంతుకను ఎస్.నాగమణి, దున్నేకొద్ది దుఃఖంను మారుతీ పౌరోహితం, కొన్ని రంగులు ఒక పద్యంను జంధ్యాల రఘుబాబు, చినుకు దీవిని డాక్టర్ అరుణ, కంచె దాటే పాటను కెంగార మోహన్ సమీక్షించారు. సాహితీ వేత్తలు వెంకటేష్, చౌశా, సయ్యద్ జహీర్ అహ్మద్, కేపీఎస్ శర్మ, విజయులు, అజీజ్, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో యువత పాత్ర కీలకం


నందిరెడ్డి సాయిరెడ్డితో బజరంగ్‌దళ్ కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: సమాజ రక్షణలో యువత భాగస్వాములు కావాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రెవెన్యూ కాలనీలోని జి.పుల్లారెడ్డి భవన్‌లో ఆదివారం బజరంగ్ దళ్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోరక్షణ అందరి బాధ్యత అన్నారు. విద్యార్థి సేవా కార్యక్రమాలు, సంస్కార బోధన, సహజ విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి వాటిలో ముందుండి సేవలందించాలన్నారు. వీహెచ్‌పీ విశేష సంపర్క విభాగం ప్రాంత ప్రముఖ్ టి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేసి హిందూ సమాజం బలోపేతానికి కృషి చేయాలని, ఆలయాల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా కో–కన్వీనర్లు భగీరథ, సాయినాథ్, తేజ, వివిధ విభాగాల ప్రముఖ్‌లు సురేష్, హరికృష్ణ, రాము, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com